## క్లుప్తంగా

### గోండ్వానా పార్టీ అభ్యర్థి నామినేషన్

సీతంపేట: గోండ్వానా దండకారణ్య పార్టీ పాలకొండ నియోజకవర్గ అభ్యర్థిగా శిలిగాంకు చెందిన బిడ్డిక ఉమామహేశ్వరరావు సోమవారం నామినేషన్ వేశారు. స్థానిక ఐటీడీఏలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారికి నామినేషన్ పత్రం సమర్పించారు. సోమవారం ఒకే ఒక నామినేషన్ వచ్చినట్టు ఆర్వో తెలిపారు.

### వలంటీర్ల రాజీనామా


భామిని: కార్యదర్శి అనసూయకు రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు


గరుగుబిల్లి : రాజీనామా పత్రాలను చూపిస్తున్న దళాయివలస గ్రామ వంటీర్లు

భామిని: మండలంలోని నేరడి బీకి చెందిన ఎనిమిది మంది గ్రామ వలంటీర్లు సోమవారం రాజీనామా చేసి కార్యదర్శి లోవ అనసూయకు అందజేశారు. ఇకపై జగనన్న పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేస్తామన్నారు.

**గరుగుబిల్లిలో...**

గరుగుబిల్లి: మండలంలోని ఉద్దవోలు సచివాలయ పరిధిలోని దళాయివలసలో ఎనిమిది మంది వలంటీర్లు, గరుగుబిల్లి, గొట్టివలస సచివాలయాల నుండి చెరో ఒకరు వెరసి పది మంది తమ రాజీనామా పత్రాలను అందించినట్లు ఎంపీడీఓ పి.సూర్యనారాయణ సోమవారం తెలిపారు. టీడీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ తామంతా స్వచ్ఛందంగా రాజీనామా పత్రాలను అందించినట్లు వలంటీర్లు తెలిపారు.

### నేడు సీతంపేట మండలంలో ప్రచారం

సీతంపేట: మండలంలోని పలు గ్రామాల్లో పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి మంగళవారం ప్రచారం చేయనున్నారు. హడ్డుబంగి, కొండాడ, చింతాడ పంచాయతీల పరిధిలో ప్రచారం చేయనున్నారని మండల పార్టీ కన్వీనర్ జి.సుమిత్రారావు తెలిపారు.

### సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

పార్వతీపురంటౌన్: సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. పట్టణంలోని 13,19 వార్డుల్లో సోమవారం ఇంటింటి ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల ద్వారా పేదలను లక్షాధికారులుగా చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసం చేసేందుకు ప్రజల మధ్యలో తిరుగుతున్నారని, వారి మాటలను నమ్మొద్దని కోరారు. ప్రజలకు మళ్లీ సంక్షేమ పథకాలు అందాలంటే ఎమ్మెల్యేగా జోగారావును, ఎంపీగా డాక్టర్ గుమ్మ తనూజారాణిని గెలిపించుకొని జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్లు తెలుగు బోదయ్య, నేతాజీ, రణభేరి చిన్నంనాయుడు, నిమ్మకాయల సుధీర్, సువ్వాడ శ్రీను, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

### జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి


సాలూరు రూరల్: ఇంటింటి ప్రచారం చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ

సాలూరు రూరల్: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ అన్నారు. కొత్తవలస గ్రామంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. అభివృద్ధి రెట్టింపు అవ్వాలన్నా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిత్యం పాటుపడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొరను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని ఆమె కోరారు.

# అక్కచెల్లెమ్మల ఆశలు తీర్చేలా.. ఆసరా


రుణమాఫీ వర్తించటంతో సంతోషం వ్యక్తం చేస్తున్న సంఘాల సభ్యులు (ఫైల్)

- డ్వాక్రా రుణమాఫీతో ఆర్థికంగా తోడ్పాటు

పాలకొండ రూరల్:

మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. అక్కచెల్లెమ్మలకు అన్ని విధాలా అండగా నిలుస్తూ ఆర్థిక చేయూత అందించారు. జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తాను అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల వ్యవధిలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణమాఫీ అమలుకు శ్రీకారం చుట్టారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అక్కచెల్లెమ్మలకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ఎస్‌హెచ్‌జీ సంఘాల పరిధిలో మహిళలకు సున్నా వడ్డీకి రుణాలు అందించడంతో పాటు దశలవారీగా రుణమాఫీ చేసి వారి సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి జగన్ ప్రభుత్వం దోహదపడింది. నియోజకవర్గంలో అర్హులైన డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో రూ.120.26 కోట్లు రుణమాఫీ చేశారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి.... అధికారం చేపట్టిన తర్వాత తన హామీను తుంగలో తొక్కారు. నిలువునా అక్కచెల్లెళ్లను మోసం చేసి వారిని అప్పుల ఊబిలోకి నెట్టేసారని మహిళలు గుర్తు చేసుకుంటున్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ పారదర్శకంగా అమలు చేస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ముక్తకంఠంతో సంఘాల సభ్యులు పేర్కొంటున్నారు.

**2020 - 2024 మధ్య నాలుగు విడతలుగా అందించిన రుణమాఫీ ఇలా..**

| మండలం | సంఘాలు | మొత్తం సభ్యులు | అందిన మొత్తం (రూ.కోట్లలో..) |
|---|---|---|---|
| భామిని | 702 | 7739 | 14.80 |
| పాలకొండ | 938 | 10335 | 26.86 |
| సీతంపేట | 925 | 10302 | 21.32 |
| వీరఘట్టం | 1378 | 15323 | 39.26 |
| పాలకొండ | 563 | 5638 | 18.02 |

### ఆర్థికంగా నిలదొక్కుకున్నాం



మహిళా సంఘాల సభ్యుల పట్ల జగన్ ప్రభుత్వం ఎంతో శ్రద్ధ వహించింది. ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో రుణ మాఫీ అందించారు. ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా నా బ్యాంకు ఖాతాకు ఆ మొత్తాలు జమ కాబడ్డాయి. నేను పిండిమిల్లు, డైరీఫామ్ నడిపిస్తున్నాను. నాకు రూ.26వేల 500 మాఫీ వర్తించింది.

– కోట దశమ్మ, సత్యసాయి ఎస్‌హెచ్‌జీ సంఘ సభ్యురాలు, ఓని గ్రామం, పాలకొండ మండలం

### టైలరింగ్ చేస్తూ..



మధ్య తరగతి కుటుంబానికి చెందిన నేను డ్వాక్రా ద్వారా అందిన రుణంతో టైలరింగ్, డైరీఫామ్ నడిపిస్తున్నాను. గత ప్రభుత్వంలో మహిళా సంఘాల రుణ మాఫీ సక్రమంగా చేయకపోవటంతో చేసిన రుణాలు తీర్చలేక అవస్థలు పడ్డాం. జగనన్న ప్రభుత్వంలో నాలుగు విడతల్లో రూ.32,500 రుణమాఫీ వర్తించింది. దీంతో అప్పుల భారం నుండి ఉపశమనం లభించింది. రుణమాఫీతో పాటు సున్నా వడ్డీ రుణాలు అందించి సంఘాల సభ్యులకు జగన్ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించింది.

– పిన్నింటి కళ్యాణి, మదర్ ఎస్‌హెచ్‌జీ సంఘం, బుక్కూరు గ్రామం పాలకొండ మండలం

# వైఎస్సార్‌సీపీతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి


ఏగులవాడ గ్రామ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి విజయ తిలకం దిద్దుతున్న మహిళ

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: గిరిజన గ్రామాల అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందని, ఐదేళ్లలో మీకు సంక్షేమ పదకాలతో పాటు, అభివృద్ధి జరిగిందంటేనా తమకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ప్రజలకు పిలుపునిచ్చారు. కురుపాం మండలంలోని పి లేవిడి, కోనగూడ, కుంబేమానుగూడ, గుమ్మ గదబవలస, చాపరాయిగూడ, ఏగులవాడ, సీడుమానుగూడ, రజ్జిలి,జొంగరపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనను గత టీడీపీ ప్రభుత్వ పాలనను ప్రజలు బేరీజు వేసుకొని వ్యత్యాసాన్ని గుర్తించాలన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి నిర్మాణాలు చేపట్టిందన్నారు. ప్రతీ గిరిజన గ్రామానికి రహదారి, తాగునీరు సౌకర్యాలు కల్పించామని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల ద్వారా నేరుగా అర్హులైన ప్రతీ ఒక్కరికి పార్టీలకు అతీతంగా లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ అభ్యర్థులు ఎన్నికల మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతీ ఇంటికి వెళ్లి మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రచార కార్యక్రమంలో గుమ్మ సర్పంచ్ ఆరిక గోపాలరావు, ఏగులవాడ సర్పంచ్ అలివేలు, పిలేవిడి నిమ్మక కవిత, కురుపాం ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, రాజేశ్వరి, సంతోషిరాణి గౌడు, మండల కన్వీనర్ గౌరీశంకర్, నీలకంఠాపురం సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆనిమి ఇందిరాకుమారి, నాయకులు బుజ్జి, వెంకటేష్, సుబ్బు, షేక్ ఆదిల్, రేవు సత్తిబాబు, షేక్ నూరెల్లా, తదితరులు పాల్గొన్నారు.

# పేదల ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి

- జగనన్న పాలనలోనే గ్రామ స్వరాజ్యం
- ఎన్నికల ప్రచారం ఎమ్మెల్యే కళావతి


కాంగూడలో విస్తృతంగా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళావతి

సీతంపేట: పేదల ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి కోరారు. పెద్దూరు, వలగెడ్డ, పాతపణుకువలస, కొత్తపణుకువలస, కిరప, కాంగూడ, సోమగండి గ్రామాల్లో సోమవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. తమ గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలతో పాటు సమాజంలో అభివృద్ధి చూపారని ఎమ్మెల్యే అన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. గిరిజన ప్రాంతంలో టీడీపీ హయాంలో సంక్షేమ పథకాలు అందక ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో వేలాది కిలోమీటర్లు పాదయాత్ర చేసి ప్రజల కష్టాలను తెలుసుకుని ప్రతీ కుటుంబానికి మేలు చేశారన్నారు. ఐదేళ్లలో 99 శాతం పథకాలు అమలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలకంటే ఎక్కువగా పథకాలు అమలు చేశారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మన రాష్ట్రంలో నేటి వరకు పాలించిన ఏ ప్రభుత్వం గాంధీజి కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని అమలు చేయలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత మన అందరి పేదల ప్రభుత్వానిదేనన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎక్కడా ఒక్క రూపాయి అవినీతి జరగకుండా డీబీటీ పద్ధతిలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేసిన ఘనత ప్రభుత్వానికి దక్కిందన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి బాటలో నడవాలంటే మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎంపీపీ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, ఏఎంసీ చైర్మెన్ మోహన్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు లక్ష్మి, సర్పంచ్‌లు హెచ్.ఆదిలక్ష్మి, విజయకుమారి, ఎ.కళావతి, వెంకునాయుడు, తిరుపతిరావు,సరస్వతి, ఎంపీటీసీలు చంద్రశేఖర్, హరిబాబు, పార్టీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు, ఎ.లిల్లీపుష్పనాథం, ఎస్.రాము, రవికుమార్, ఎస్.కాంతారావు, ఎస్.అబ్బాస్, వెంకీ, సాయికుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


అట్టలిలో తాగునీటి బోరు మరమ్మతులు పర్యవేక్షిస్తున్న సిబ్బంది

పాలకొండ రూరల్: వేసవి నేపథ్యంలో మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తెలిపారు. సోమవారం పంచాయతీల వారీగా కార్యదర్శులతో సమీక్షించారు. 32 పంచాయతీల్లో గల 62 గ్రామాల్లో అందుబాటులో ఉన్న 308 చేతిబోర్లు శతశాతం వినియోగంలో ఉన్నట్టు కార్యదర్శులు స్పష్టం చేశారు. 22 సచివాలయాల ద్వారా రోజువారీ నివేదికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన తక్షణమే మరమ్మతులు చేయిస్తున్నట్టు ఎంపీడీఓకు కార్యదర్శులు వివరించారు. అట్టలిలో మరమ్మతులకు గురైన చేతి బోరును అందుబాటులోకి తీసుకువచ్చినట్టు వివరించారు.

# ట్యాంకరతో నీటి సరఫరా


దబరలో ట్యాంకర్ల ద్వారా నీటిని అందజేస్తున్న ఆర్ డబ్ల్యూఎస్ సిబ్బంది

సీతంపేట: ఎత్తైన కొండలపై మంచినీటి సమస్య ఎదుర్కొంటున్న గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేస్తున్నారు. దీనిలో భాగంగా నీటి ఎద్దడి గ్రామాలుగా గుర్తించిన వోవుమానుగూడ, దబర, గోలుకుప్పగూడ, దిగువదరబ, గొర్రిమడ, మర్రిమానుగూడ గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్టు ఆర్ డబ్ల్యూఎస్ డీఈ ఢిల్లేశ్వరరావు, ఏఈ పాపారావు తెలిపారు. ఏ గ్రామాలైన ఇంకా తాగునీటి సమస్య ఎదుర్కొంటే తప్పనిసరిగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నామన్నారు.

# ఉల్లాసంగా.. ఉత్సాహంగా...


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

భామిని: మండలంలోని విద్యాబోధనలో గుర్తింపు పొందిన నేరడి-బి ఎంపీయూపీ స్కూల్‌లో సోమవారం సందడిగా ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. 1 నుండి ఎనిమిదవ తరగతి వరకు విద్యార్థులు సుందరంగా అలంకరించుకొని దేశ భక్తి గీతాలు, సినీ గీతాలకు నృత్యాలు చేసి అలరించారు. హెచ్‌ఎం ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సూచనలు చేశారు. వేసవి సెలవులలో తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం

పాలకొండ: మండలంలోని ఓని ప్రభుత్వ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన కుదుమ తిరుమలరావును పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం బి.నాగమణి మాట్లాడుతూ ప్రతి రోజు అదనపు తరగతులు నిర్వహించి పాఠశాల అభివృద్ధిలో తిరుమలరావు కీలక పాత్ర పోషించారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

### శ్రీరామ అంటే మోక్షం


త్రైత సిద్ధాంతాలపై ప్రచారం చేస్తున్న సేవా సమితి సభ్యులు

భామిని: మండలంలోని లివిరి, అనంతగిరి గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానం యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక ప్రభోదాలను ప్రచారం చేశారు. శ్రీరామ అంటే మనిషి మోక్షం పొందడం అని అర్థమని వివరించారు. దైవతత్వాన్ని ఇంటింట వివరించారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

# టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల సత్తా


పాలకొండ: ఎం. సింగుపురం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి మిఠాయి తినిపిస్తున్న ఉపాధ్యాయులు


అల్లు యోగిత, 583


కర్రి నిశిత, 578


బుగత రేవతి, 579


తాడేల సాయి శరణ్య, 585


మజ్జి రాకేష్, 585


బొడ్డు జాన్, 571


అల్లాడ సోనియా, 580


ఎస్.చరణ్, 581


యాళ్ల యోషిత, 577


గ్రంధి కృపాజ్యోతి, 575


జి.విశాలక్ష్మి, 568

పాలకొండ:

పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ సత్తా చాటారు. మండలంలోని ఎం.సింగుపురం ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎస్.మనోహర్ 588 మార్కులు సాధించాడు. ఇదే పాఠశాలకు చెందిన డి.రమ్య 586 మార్కులు సాధించింది. ఈ పాఠశాల నుంచి 48 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా శతశాతం ఉత్తీర్ణత సాధించారు. పట్టణంలోని గిరిజన సంక్షేమ పాఠశాల నుంచి 40 విద్యార్థులు హాజరుకాగా శతశాతం ఉత్తీర్ణత సాధించారు. బాసూరు జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 95.24శాతం, గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల నుంచి 92శాతం ఉత్తీర్ణత సాధించారు. తంపటాపల్లి పాఠశాల నుంచి 89.13శాతం, పాలకొండ బాలిక పాఠశాల నుంచి 85.71శాతం, జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 72.71శాతం, చిన మంగళాపురం పాఠశాల నుంచి 87.50శాతం ఉత్తీర్ణత సాధించారు.

**సత్తా చాటిన ఐటీడీఏ ఆశ్రమాలు**

సీతంపేట: పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో సీతంపేట ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు సత్తా చాటాయి. 1708 మందికిగాను 1675 మంది ఉత్తీర్ణులై 98.7 శాతం ఉత్తీర్ణత సాధించారు. 28 పాఠశాలల్లో అందరూ పాసై శతశాతం ఫలితాలు సాధించారు. సీతంపేట మండలంలో 13 ఆశ్రమపాఠశాలలకుగాను 11 పాఠశాలలు శతశాతం ఫలితాలు సాధించాయి. కేజీబీవీ, స్థానిక జీహెచ్ స్కూల్‌లు శతశాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 98.21 శాతం, ముత్యాలు బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 94.74 శాతం ఫలితాలు సాధించారు. గిరిజన సంక్షేమ బాలుర, బాలికల గురుకుల పాఠశాల, మల్లి గిరిజన గురుకుల పాఠశాలల్లో శతశాతం ఫలితాలు సాధించారు. గవర్నమెంట్ హైస్కూల్ (జీహెచ్) విద్యార్థి బొడ్డు జాన్ 571 మార్కులతో సీతంపేట మండలంలో మొదటి స్థానంలో నిలిచాడు.

**బాలికలే టాప్...**

భామిని: టెన్త్ ఫలితాల్లో మండలంలో బాలికలే టాప్‌గా నిలిచారు. మండలంలోని 473 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 444 మంది పాసై 93.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో లివిరికి చెందిన అల్లాడ సోనియా 580 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. భామిని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని గురుబిల్లి లావణ్య 573 మార్కులు సాధించి మండల స్థాయిలో రెండవ స్థానం నిలిచిందని ప్రిన్సిపాల్ ఆర్‌శివ కుమార్ తెలిపారు.

**సత్తాచాటిన సర్కారు విద్యార్థులు**

వీరఘట్టం: పదో తరగతి ఫలితాల్లో పదో తరగతి విద్యార్థులు సత్తాచాటారు. 638 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 96.71 శాతం మంది అనగా 617 మంది ఉత్తీర్ణులయ్యారు. నీలానగరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన దుప్పాడ సంజన 587 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. అలాగే ఎస్.చరణ్ 581, బుగత రేవతి 579 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. తలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన తాడేల సాయిశరణ్య 585, మజ్జి రాకేష్ 585, అల్లు యోగిత 583, కొరికాన వాగ్దేవి 583 మార్కులు సాధించారు.

**టెన్త్ ఫలితాల్లో ప్రభంజనం**

కొమరాడ: మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో 508 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరు కాగా 489 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ జామి నారాయణస్వామి తెలిపారు. మాదలింగి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన తెర్లి సాహితి 586, పండా హేమంత్‌కుమార్‌కు 586, కోటిపాం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన కె.చాందినికి 578 మార్కులు సాధించారు.

**పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ**

కురుపాం: పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 98శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖాధికారి ఎన్.సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 612 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 600 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వడ్డి అనూష 586 మార్కులు సాధించి మండలానికే టాపర్‌గా నిలిచిందని, ఆదర్శ పాఠశాలకు చెందిన యాళ్ల యోషిత 577, కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గ్రంధి కృపా జ్యోతి 575 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిందన్నారు.

**టెన్త్ ఫలితాలు భేష్..**

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని 13 పాఠశాలల నుంచి 623 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 614 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలానికి 98.56 శాతం ఉత్తీర్ణత లభించింది. 8 పాఠశాలలకు శాత శాతం ఉత్తీర్ణత లభించింది. భద్రగిరి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (బాలికల)కు చెందిన ఎం.బిందుమతి 567 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా.. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వై.తేజసిన్హ 557 మార్కులు సాధించి మండల స్థాయిలో ద్వితీయస్థానంలో..భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ గర్ల్స్ స్కూల్‌కు చెందిన ఎం.లావణ్య 555 మార్కులు సాధించి మండల స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచారు.

**పదిలో 98 శాతం ఉత్తీర్ణత**

గరుగుబిల్లి: మండలంలోని ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీజీ, డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 444మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 98శాతం 435 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండలానికి సంబంధించి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జి.విశాలక్ష్మి 568 మార్కులు సాధించి ప్రథమ స్థానలో నిలిచింది.

**బీజేపురం విద్యార్థిని టాప్**

జియ్యమ్మవలస: బీజేపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థిని కర్రి నిశిత 578 మార్కులతో మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. వి చాందిని 570 మార్కులతో ద్వితీయ స్థానం, 562 మార్కులతో పి.పావని తృతీయ స్థానంలో నిలిచింది.

### ఐదెకరాల గడ్డివాముల దగ్ధం

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామానికి చెందిన పాపినాయుడు, ఆదినారాయణకు చెందిన ఐదెకరాల గడ్డివాములు సోమవారం దగ్ధమయ్యాయి. ప్రమాదం ఎలా జరిగిందో తెలియలేదని బాధిత రైతులు తెలిపారు. పాలకొండ అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.


తెట్టంగిలో దగ్ధమవుతున్న గడ్డి వాములు